రైతు ఆనందంగా ఉండాలన్నదే వైసీపీ లక్ష్యం

- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- 2,603 మంది కౌలు రైతులకు రూ.1.95 కోట్ల రైతు భరోసా సాయం
-మరో 182 మంది రైతులకు రూ.9.88 లక్షల పంట నష్టపరిహారం చెల్లింపు

విశాలాంధ్ర-విజయనగరం: రైతు ఆనందంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని దానిలో భాగంగానే రైతు భరోసా, పంట నష్ట పరిహారం, పెట్టుబడి రాయితీ సకాలంలో చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తోందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భూమి లేని పేదలకు కూడా ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో సీసీఆర్సీ కార్డులున్న కౌలు రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని గుర్తు చేశారు. సాధారణ కౌలు రైతులు, దేవాదాయ భూముల్లో సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు రైతు భరోసా ఆర్థిక సాయం, మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలకు పంట నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించే నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వరుసగా ఐదో ఏట తొలి విడత నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా మీట నొక్కి జమ చేశారు. కార్యక్రమంలో జిల్లా నుంచి జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీసీసీబీ ఛైర్మన్ చినరాము నాయుడు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, ప్రధానంగా రైతుల కోసం రైతు భరోసా, పంట నష్ట పరిహారం, పెట్టుబడి రాయితీ, భేషరతు నిబంధనలతో రుణ సదుపాయం, ఇతర మార్గాల్లో ఆర్థిక తోడ్పాటును అందిస్తోందని పేర్కొన్నారు. వరుసగా ఐదో ఏట తొలి విడతలో భాగంగా జిల్లా నుంచి 2,603 మంది కౌలు రైతులకు రూ.1.95 కోట్ల ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసిందని వివరించారు. వారిలో దేవాదాయ భూముల్లో సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఐదుగురు ఉన్నారని వారికి కూడా ఆర్థిక సాయం అందిందని స్పష్టం చేశారు. వీరితో పాటు ఈ ఏడాది మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలకు 39.54 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని 182 మంది బాధిత రైతులకు రూ.9.88 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని జడ్పీ ఛైర్మన్ వివరించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీసీసీబీ ఛైర్మన్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా కౌలు రైతులకు, పంట నష్టం వాటిల్లిన రైతులకు సంబంధిత మెగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన కౌలు రైతులు, జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు, ఉద్యాన శాఖ డీడీ జమదగ్ని, పశు సంవర్ధక శాఖ జేడీ మల్లేశ్వరరావు, సెంట్రల్ బ్యాంకు డీఎం జగన్నాథం, వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాల వెనుక అధికార పార్టీ నాయకుల చీకటి ఒప్పందం!

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆరోపణ

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో ఉన్న ఇందిరమ్మ కాలనీ నకిలీ పట్టాల విషయంలో రెవెన్యూ యంత్రాంగం గాని మున్సిపల్ యంత్రాంగం గాని స్పందించకపోవడంలో అంతర్యం ఏమిటంటే గతంలో ఈ ఇందిరమ్మ కాలనీ కి సంబంధించిన రెండు విడతల్లో ఇండ్ల లబ్ధిదారులకు ఇచ్చిన పట్టా రిజిస్టర్ సంబంధించిన ఇచ్చిన రికార్డులను మాయం చేశారని గతంలో తహశీల్దార్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం రిటైరైన తాసిల్దార్ లక్ష్మణ్‌ప్రసాద్ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం ప్రజలందరికీ తెలిసిన విషయమే.. ఇలాంటి సమయంలో ఇందిరమ్మ కాలనీ కి సంబంధించి నకిలీ పట్టాల విషయంలో రెవెన్యూ. మున్సి పల్ యంత్రాంగం ప్రస్తుతం వ్యవహరిస్తున్న తీరు హాస్య స్పందంగా ఉందని. సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ , జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న లు అధికారులకు తీరుపై ఆగ్రహ వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక విలేకరు లతో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు ఏదైతే ఇందిరమ్మ కాలనీలో బినామీ పట్టాలతో అక్రమకట్టడాలు కట్టించారో అలాంటి వాటిని జెసిబితో తొలగిస్తానని ప్రజలకు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదో ఇందిరమ్మ ఇల్లులు కుంభ కోణంలో ఎమ్మెల్యే హస్తం ఉండబట్టే మున్సిపల్ రెవిన్యూ అధికారులు చేపట్టి నివేదికలు బయటికి రాలేదని అన్నారు. ఇంతవరకు ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలు పై నిర్మించిన ఇళ్లను ఎన్ని తొలగించారో ముందు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు సమాధానం చెప్పాలని ఈ సందర్భం గా డిమాండ్ చేశారు. ఇంది రమ్మ కాలనీలో జరుగు తున్నటువంటి నకిలీ పట్టాల విషయం ప్రస్తుతం జరుగుతున్నటువంటి అక్రమ కట్టడాల పై పూర్తి సమాచారం ఎమ్మెల్యే దగ్గర ఉన్నా సరే ఎందుకు స్పందిం చడం లేదని నిజంగా ఈ ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉన్నట్లయితే గతంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ ఏం చేసిందో? వాటి వివరాలను బొబ్బిలి ప్రజానీకానికి తెలియజేయాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నాము లేని పక్షంలో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామని మరోసారి హెచ్చరించారు.

నేటి యువత లక్ష్యం వైపు ప్రయాణించాలి : హేమంత్

విశాలాంధ్ర-చీపురుపల్లి : స్థానిక జీవిఆర్ ప్రభుత్వ కాలేజ్ గ్రౌండ్ ఆవరణలో గత 8 సంవత్సరాల నుండి ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ రన్ మీషన్ నేతృత్వంలో చీపురుపల్లితో పాటూ శ్రీకాకుళం జిల్లా చుట్టూ ప్రక్కల గ్రామీణ ప్రాంతాల్లో వున్న యువతకు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వం బలగాలు సంబంధించి అర్హత సాధించిన వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి వారి జీవితంలో స్థిరపడే విధంగా ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 120 సాధించినట్లు కంది హేమంత్, సహాయ కోచ్ బూరాడ నవీన్ తెలిపారు. ఇటీవల ఎస్ఎస్‌సీ సెలక్షన్ లో 12 మంది ఉద్యోగాలు సాధించిన వారికి గ్రౌండ్ తరుపున సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ,ఆర్. జగదీష్, యువత పాల్గొన్నారు.

ద్రవ జీవామృతం ఉపయోగంపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-తెర్లాం: బీమవరంలో మండల వ్యవసాయధికారి కే. శిరీష ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులతో ద్రవ జీవామృతం తయారు చేయించి రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులకి ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువుగా జీవామృతం పనిచేస్తుందని తెలిపారు. రసం పీల్చే పురుగులు ఉనికి గమనించి సస్య రక్షణ చర్యలు చేపట్టే విదంగా పసుపు రంగు జిగురు పూసిన అట్టలు ఎకరానికి 8 చొప్పున అక్కడక్కడా పెట్టించడం జరిగింది. రసాయన ఎరువులు కి ప్రత్యానమ్నాయంగా సేంద్రియ ఎరువులు వాడాలని కోరారు. సస్య రక్షణ కోసం మందులు వాడే ముందు వ్యవసాయ శాఖ సిబ్బంది సిఫార్సులు మేరకే మందులు వాడాలని రైతులుకి సూచించారు. ఈ పంట నమోదు కోసం రైతు సాగు చేస్తున్న పంట వివరాలు తో వెళ్లి ఆర్‌బికె సిబ్బంది వద్ద ఈ క్రాప్ బుకింగ్ ఈ నెల 15వ తేదీ లోపు చేపించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ రాంబాబు, పొలం బడి రైతులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఎల్ఐసి పాత్ర కీలకం

విశాలాంధ్ర-గరివిడి: ప్రభుత్వ రంగ భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్ఐసి భాగస్వామ్యం, దేశ అభివృద్ధిలో కీలకమని కార్యాలయం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఎల్ఐసి ఆవిర్భావ దినోత్సవం వారోత్స వాల ప్రారంభ వేడుకలను ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌తో పాటు పలువురు అతిథులు ఎల్ఐసి అధికారులు ఉద్యోగులు ఏజెంట్ల ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీనియర్ బ్రాంచ్ మేనేజర్ విజయశ్రీ సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ ప్రకాష్ ఏబీఎన్ రమణమూర్తి ఎల్ఐసి అధికారుల సంఘం ప్రతినిధి రామారావు కుసుమకుమారి డెవలప్మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి పకీర్‌నాయుడు ఇన్సూరెన్స్ ఎంప్లాయిన్ యూనియన్ ప్రతినిధి సిద్ధార్థ ఏజెంట్ అసోసియేషన్ ప్రతినిధి నడిమింటి సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ సామాన్యుల నుండి సంపన్నుల వరకు జీవిత బీమా అవసరాలకు అనుగుణంగా పాలసీదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ రంగ ఎల్ఐసి సేవలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్ కామునాయుడు, ఎంప్లాయిన్ యూనియన్ పూర్వ ప్రతినిధి కేఎస్ఎన్ మూర్తి మాట్లాడారు.

47మంది కౌలు రైతులకు భరోసా మంజూరు

పంటనష్టం ఆ ఒక్కరికే మంజూరు

విశాలాంధ్ర-జామి: రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది మొదటి సారిగా అమలు చేసిన కౌలు రైతులకు రైతు భరోసా పథకంలో మండలంలోని 47మంది కౌలురైతులుకు నగదు మంజూరు అయింది. ఈమేరకు శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2603మంది కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించగా వారిలో ఎస్‌కోట నియోజకవర్గానికి చెందినవారు 182మంది, గజపతినగరం నియోజకవర్గానికి చెందిన వారు 570మంది కౌలురైతులు ఉన్నారు. జామి మండలానికి సంభందించి 47మందిని కౌలు రైతులుగా రైతు భరోసాకు అర్హత ఉన్నవారిగా అధికారులు గుర్తించారు.

అరటి పంటనష్ట పరిహారం ఈఒక్కరికే మంజూరు..

ఈఏడాది మే, జూన్ నెలల్లో వీచిన గాలుకు అరటి పంట చాలా వరకు జిల్లాలో నష్టం కలిగింది. అందులో భాగంగా జామి మండలంలోని పలు ప్రాంతాలలో అరటికి నష్టం వాటిల్లింది. కానీ మండలంలోని వెన్నె గ్రామంలో చలుమూరి రామారావుకు చెందిన అరటిపంట 1.22 హెక్టార్లలో పూర్తిగా నష్టం కలగడంతో వ్యవసాయా అధికారులు అతనికి పంట నష్టంకు సిఫార్సు చేసారు. దీంతో చలుమూరి రామారావుకు రూ.30, 500నగదును పంటనష్ట పరిహారంగా ప్రభుత్వం మంజూరు చేసింది.

నియోజకవర్గంలో 798 కొత్త పింఛన్లు మంజూరు

ఎమ్మెల్సీ సురేష్ బాబు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల నియోజకవర్గంలో కొత్తగా 798 కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు చెప్పారు. నెల్లిమర్ల మండలం మొయిదలో నూతనంగా మంజూరైన 16 పింఛన్లను ఎమ్మెల్సీ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 5434 సామాజిక పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి అట్టాడ కృష్ణ పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు

- అంధకారంలో గ్రామాలు - గ్రామస్తుల అసహనం

విశాలాంధ్ర-భోగాపురం: కరెంటు కోతలుతో మండలంలోని ప్రజలును ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట రాత్రి వేళల్లో రోజుకు 2 నుంచి 3 గంటలు కరెంటు కోతలు విధించడంతో పేద, దిగువ మధ్యతరగతి వర్గాలవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రాత్రిపూట విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి.ఏ సమయంలో విద్యుత్ సరఫరా ఆపేస్తారో తెలియక ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర ఒక్క పోత, దోమల బెడదతో పిల్లలు, వృద్దులు, అనారోగ్యం పాలవుతున్నారు. విపరీతంగా కరెంటు చార్జీలు పెంచి కరెంట్ సరిగ్గా ఇవ్వట్లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం ముగిసినా ఎండలు ఎక్కువ కావడం, ఉష్ణోగ్రతలు పెరగటంలో అనూహ్యంగా విద్యుత్ వినియోగం పెరిగిందని అంటున్నారని, అయితే దీనికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచడమో లేదా కొనుగోలు చేసి సరఫరా చేయడమో వంటి చర్యలు తీసుకోకుండా అనధికార కోతలు విధించడం దారుణ మన్నారు. అధిక వాడకం పేరుతో రాత్రి పూట అనధికార విద్యుత్ కోతలు తీవ్రంగా బాధిస్తున్నాయని, మండలంలో ప్రతీరోజు రాత్రి 2 నుంచి 3 గంటలు కరెంటు సరఫరా ఆపేయడంతో గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన ఈ సమస్యను పరిష్క రించి కరెంటు కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఒకవైపు వ్యవసాయ పనులు.. వేళాపాళా లేని కోతలు

మెరకముడిదాం: మండలంలో గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. రైతుల ఉదయం నుంచీ సాయంత్రం వరకు పొలాల్లో కష్టపడి ఇంటికి వచ్చేసరికి విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండటం లేదు. దీనికి తోడు దోమల బెడద ఎక్కువగా ఉండటంతో రైతులకు కంటి నిండా నిద్ర లేకుండా పోతుంది. వేళాపాళా లేని విద్యుత్ కోతతో ఇటు చిన్నారులూ, అటు వృద్ధులకు ఉక్కపోతకు గురవుతుండటమే కాక దోమల బెడద కారనంగా పలు వ్యాధులకు గురౌతున్నారు. అధికారుల తక్షణమే విద్యుత్ కోతల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుచూన్నారు.

వరకట్న హత్య కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష

ఎస్ఐ రాజేష్

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన కసిరెడ్డి సన్యాసినాయుడు(35) తన భార్యను వరకట్న వేధింపులతో తన భార్యను హత్యకు పాల్పడ్డాడని వల్లంపూడి పోలీసు స్టేషనులో 2016లో నమోదైన వరకట్నం వేధింపులు, హత్య నేరం కేసులో నిందితుడు కశిరెడ్డి సన్యాసి నాయుడుకి పదేళ్లు జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ సెప్టెంబరు 1న విజయనగరం 1వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి జి. రజని తీర్పును వెల్లడించారు. ఈ కేసులో పోలీసు వారి తరుపున పబ్లిక్ ప్రోసి క్యూటర్గా మెట్ట ఖజానారావు వాదనలు వినిపించారు.వివరాల్లోకి వెళ్ళితే నిందితుడు కశిరెడ్డి సన్యాసినాయుడు తన తల్లిదండ్రులతో కలిసి మండలంలోని ఆతవ గ్రామంలో నివాసం ఉండేవాడని. నిందితుడు కశిరెడ్డి సన్యాసి నాయుడు విశాఖపట్నం జిల్లా, కె.కోటపాడు మండలం, సూదివలస గ్రామానికి చెందిన పార్వతితో 2013, మే నెలలో వివాహం జరగగా వీరికి ఒక పాప జన్మించిందన్నారు. కొన్నాళ్ళు తరువాత భార్య పార్వతిని సన్యాసినాయుడు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తూ, ఆమె కన్నవారింటికి వెళ్ళగొట్టారు. తరువాత ఆమెను బాగా చూసుకుంటానని నమ్మించి కన్నవారింటి నుండి తిరిగి కాపురంకు తీసుకొని వచ్చాడు. కాని, నిందుతుడు మరలా అదే విధంగా అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో, తన భర్త సన్యాసినాయుడులో ప్రవర్తనలో ఎటువంటివంటి మార్పురాకపోవడంతో మనస్థాపం చెంది పార్వతి (మృతురాలు) తేది. 10-03-2016న ఇంటిలో ఉన్న ఫ్యానుకు ఉరివేసుకొని చనిపోయింది. ఈ విషయమై ఆమె తల్లి వర్రి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వల్లంపూడి ఎస్.ఐ ఎం.కృష్ణమూర్తి వరకట్న వేధింపులు, హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. అప్పటి విజయనగరం డిఎస్పీ టి.వెంకట రత్నం దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి,కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో నిందుతుడు కశిరెడ్డి సన్యాసి నాయుడుపై నేరారోపణలు రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ళ కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ విజయగనరం 1వ అదనపు సెషన్సు కోర్టు న్యాయమూర్తి జి.రజిని సెప్టెంబరు 1న తీర్పును వెలువరించినట్లుగా వల్లంపూడి ఎస్.ఐ. కె.రాజేష్ తెలిపారు.

తాగునీటికై ఖాళీ బిందెలతో ధర్నా

ఐదు రోజులుగా నీరు రాలేదని మండిపాటు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట గ్రామంలో గడిచిన ఐదు రోజులుగా వీధి కుళాయిలు ద్వారా మంచినీరు రాకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న ఎగువీధి మహిళలు పంచాయతీ కొళాయి వద్ద శుక్రవారం ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొద్దిరోజులుగా కుళాయిల నీరు రాకపోవడం వల్ల గ్రామానికి దూరంగా ఉన్న నూతుల నుంచి తెచ్చుకుంటున్నామని, చాలా అవస్థలు పడుతున్నామని తెలిపారు. వెంటనే పంచాయతీ పాలకులు కలుగజేసుకొని నీటి సమస్యను తీర్చాలని కోరారు. గ్రామ వార్డు సభ్యుడు జుత్తాడ రామసత్యం మాట్లాడుతూ ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పాలకులకు పట్టకపోవడం తమ గ్రామస్తుల దురదృష్టమని వ్యాఖ్యానించారు. 4000 మంది ప్రజలు తమ గ్రామంలో ఉన్నారని, నీరు రాక ఎన్నో అవస్థలు పడుతున్నా పంచాయతీ వారికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దౌర్భాగ్యం అని పేర్కొన్నారు. వెంటనే నీటి సౌకర్యం ప్రజలకు కల్పించి దాహార్తిని తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

కొత్తపింఛన్లు పంపిణి చేసిన నేతలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లను మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజా ప్రతినిధులు,నాయకులు శుక్రవారం పంపిణి చేశారు. మండలంలోని ఇంతవరకు 10వేల 672 వైఎస్సార్ పింఛన్లు పంపిణి చేయగా, కొత్తగా 218మందికి పింఛన్లు వచ్చినట్లు ఎంపిడిఒ ప్రసాద్ తెలిపారు. దీంతో పాటు శుక్రవారం కొత్తగా మరో 388మంది పింఛన్ల పరిశీలన కోసం వచ్చాయని, వాటిని సచివాలయంల వారీగా శనివారం సాయంత్రం లోగా పరిశీలన చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.శుక్రవారం నాడు మరిపివలసలో వైఎస్సార్సీపీపార్టీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు,సర్పంచ్ దొర, పెదంకలంలో ఎంపిపి బలగ రవనమ్మ, జడ్పీటీసీ మామిడి బాబ్జి, నిడగల్లులో వైస్ ఎంపిపి సూర్యనారాయణ, గాజావు శ్రీనివాసరావు, జోగమ్మపేటలో పోల ఈశ్వర నారాయణ, అప్పయ్యపేటలో ఎంపీటీసీ బురిడి సూర్యనారాయణ,పెదభోగిలిలో ఎంపిటిసి కిరణ్, బక్కుపేటలో సర్పంచ్ అప్పారావు, బూర్జలో సర్పంచ్ దాసు తదితరులు పింఛనులు అందజేసారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలి

విశాలాంధ్ర-మక్కువ: మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించాలని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా మక్కువ మండలంలో వెంకట భైరపురం దెబ్బగడ్డ సంబర గ్రామ సచివాలయాల్లో మెమోరాండాలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో వరుసగా సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు పిట్టల సీతారాం తాడంకి ప్రభాకర్ అల్లు ఆదినారాయణ ఇతరులు పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధక అధికారిగా రత్నాకర్

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా జె. రత్నాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రత్నాకర్ పార్వ తీపురం సహాయ సంచాలకులుగా పనిచేస్తూ పదోన్నతి పొంది పార్వతీ పురం మన్యం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా నియమితు లయ్యారు. జిల్లాలో పశుసంవర్ధక అంశాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పాడిపశువుల సంపద పెంచడమే కాకుండా రైతులకు ఆదా యం పెంపొందించే విధంగా చర్యలుచేపట్టాలని ఆయన ఆదేశించారు.

ఏపీ రైతు సంఘం జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-పాలకొండ: అఖిలభారత కిసాన్ సభ డిమాండ్స్ డే సందర్భంగా పాలకొండ మండలం కొండాపురం, లుంబూరు గ్రామంలో సంఘం జండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1, 1936లో రైతు డిమాండ్స్ డే గా పాటిస్తూ రైతు ఉద్యమం చేపట్టారని, ఆనాటి నుండి నేటి వరకు రైతు సమస్యలపై క్షేత్రస్థాయి నుంచి రైతులను కదిలించి చైతన్య పరుస్తూ రైతు కోర్కెలపై ఉద్యమాలు జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. అఖిల భారత కిసాన్ సభ 1936 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ లక్నోలో మహాసభలో ప్రథమ అధ్యక్ష కార్యదర్శులుగా సహజానంద సరస్వతి, ఎన్జీరంగా ఎన్నుకోవడం జరిగిందని, ఆనాటి రైతుల ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పాదం రైతులకు అప్పులను రద్దుచేసి మారుటోరియం ప్రకటించాలని, బ్రిటిష్ పాలకులు జమీందారీ విధానం రద్దు చేయాలని, భూమి శిస్తూ తగ్గించాలని, రద్దు చేయాలని రుణ విమోచన చట్టం తదితర అంశాలతో డిమాండ్స్ రూపొందించి ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. ఆనాటి నుండి నేటి వరకు రైతుల ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై డిమాండ్స్ రూపొందించి క్షేత్ర స్థాయిలో గ్రామాలలో రైతులను సమీకరించి రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించడం ద్వారా రైతులకు కొన్ని చట్టాలు సాధించుకోవడం జరిగిందని తెలిపారు. ఎందరో మహనీయులు త్యాగ ఫలితంగా వచ్చిన చట్టాలు వల్ల వ్యవసాయ రంగం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. నూతన వ్యవసాయ విధానాలు వచ్చిన తర్వాత రైతుకు మనుగడకు ముప్పు వాటిల్లిందని గుర్తు చేశారు. సాధించుకున్న హక్కులను నిలబెట్టుకోవడానికి మరియు సంస్కరణ ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడడానికి ఢిల్లీ రైతన్న ఉద్యమం మరో స్ఫూర్తిదాయకమని తెలిపారు. కొండాపురం గ్రామంలో కిమిడి రామ్మూర్తి నాయుడు అధ్యక్షతన కార్యక్రమం జరగగా పాలవలస రామినాయుడు, వండాన కూర్మారావు, బలగ లక్ష్మునాయుడు, బచ్చల రామ్మూర్తి, లంక మోహన్ రావు తోపాటు నంబూరు గ్రామంలో ఆ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు లోలుగు సంఘం నాయుడు వావిలపల్లి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. వీరఘట్ట మండలం చలివేంద్ర గ్రామంలో సంఘం జిల్లా కోశాధికారి బొత్స గౌరునాయుడు జండా ఆవిష్కరణ చేయగా ఆ గ్రామ ఎంపీటీసీ పోరెడ్డి వెంకట నాయుడు, గ్రామ సర్పంచ్ ఎస్ సుదర్శన్, మరియు గర్భాన తవిటి నాయుడు, శీమల అన్నమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 3437 మంది కౌలుదారులకు లబ్ధి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో 3437 మంది కౌలు దారులకు వై.ఎస్.ఆర్ రైతు భరోసా 5వఏడాది మొదటి విడత ఆర్థిక సహాయం జమ యింది. ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శుక్ర వారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి కౌలు రైతులకు రైతు భరోసా ఆర్థిక సహాయాన్ని విడుదల చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవ సాయ సలహా మండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ లు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 3437 మంది కౌలు రైతులకు రూ.2.57 కోట్లు జమ అవుతుందని అన్నారు. ఒక ఎకరా దాటి సాగుచేస్తున్న కౌలు రైతులు ఇందుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. కురుపాం నియోజక వర్గంలో 1117, సాలూరు నియోజక వర్గంలో 604, పార్వతీపురం నియోజక వర్గంలో 1134, పాలకొండ నియోజక వర్గంలో 582 మంది కౌలుదారులు ప్రయోజనం పొందుతున్నారని ఆయన చెప్పారు. ఇందులో కురుపాం నియోజక వర్గం కురుపాం మండలంలో 75, కొమరాడ మండలంలో 235, గరుగుబిల్లి మండలంలో 614, గుమ్మలక్ష్మీపురం మండలంలో 40, జియ్యమ్మవలస మండలంలో 153 మంది ఉన్నారని తెలిపారు. సాలూరు నియోజక వర్గం పాచిపెంట మండలంలో 87, మక్కువ మండలంలో 325, సాలూరు మండలంలో 192 మంది ఉన్నారని చెప్పారు. పార్వతీపురం నియోజకవర్గం పార్వతీపురం మండలంలో 204, సీతానగరం మండలంలో 376, బలిజిపేట మండలంలో 554 మంది ఉన్నారని, పాలకొండ నియోజక వర్గం పాలకొండ మండలంలో 263, వీరఘట్టం మండలంలో 236, భామిని మండలంలో 72, సీతంపేట మండలంలో 11 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటేష్, వ్యవసాయ అధికారి అశోక్, కౌలు రైతులు పాల్గొన్నారు.

గృహ సారథులను పార్టీకి చేరువచేయాలి

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: గృహ సారదలను పార్టీకి చేరువ చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో కొత్త కార్యక్రమానికి నాంది పలుకుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టిన గృహసారథులు పార్టీ కార్యక్రమాలలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్న క్రమంలో వారిని పార్టీకి మరింత చేరువ చేసే దిశగా సరికొత్త ఆలోచన చేస్తూ గృహసారథులకు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలను స్థానిక సచివాలయం కన్వీనర్ల ద్వారా అందజేయించి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి దినోత్సవం నాడు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనేలా చేసి పార్టీతో వారందరిని మరింత మమేకం చేసి వచ్చే ఏడాది జరగబోయే సాధారణ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే దిశగా నియోజకవర్గ పరిధిలో గల వైసీపీ శ్రేణులు అందరినీ కూడా మరింత సన్నద్ధం చేసే దిశగా ముందుకు సాగడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పురపాలక సంఘం చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు భీమవరపు కృష్ణమూర్తి, మండల మరియు పట్టణ పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్ కొండపల్లి బాలకృష్ణ, సీతానగరం మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వైస్ ఎంపీపీలు, ఏఎంసి వైస్ చైర్మన్ వానపల్లి.శంకరరావు, సచివాలయం కన్వీనర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వార్డు కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, జేసీఎస్ కన్వీనర్లు, ఏఎంసి డైరెక్టర్లు, పిఎసిఎస్ చైర్మన్ లు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే తో పాటూ దోమల వ్యాప్తిని నివారించాలి

డిఐఒ డాక్టర్ జగన్మోహనరావు

విశాలాంధ్ర-బెలగాం : డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించి దోమల వ్యాప్తిని నివారించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన 16వ వార్డులో వైద్య సిబ్బంది చేపట్టిన డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటి ఆవాసాల్లో వాడుకలో లేని, వర్షాలు కారణంగా పాడైన వస్తువుల్లో చేరిన నీటి నిల్వలను గుర్తించి పారబోయించారు. ముందుగా నీటి నిల్వల్లో వృద్ధి చెందుతున్న దోమల లార్వాలను గుర్తించి, స్థానికులకు చూపించి తద్వారా కలిగే అనర్థాలను వివరించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాల్లో గుర్తించిన దోమల ఆవాసాల మురుగు నీటి నిల్వలు, వాటి వివరాలు సంబంధిత యాప్ లో అప్లోడ్ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా అక్కడి స్థానికులతో మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ మొదలగు జ్వరాలకు కారణమైన దోమల వ్యాప్తి అరికట్టాలని, అందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, డ్రైడే కార్యక్రమాల నిర్వహణ ఇందుకోసమేనని స్థానికులకు అవగాహన కల్పించారు. జ్వరాలను గుర్తిస్తే వైద్య సిబ్బంది వెంటనే చికిత్స అందజేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పుష్ప, జయగౌడ్, ఎఎన్ఎం నారాయణమ్మ, ఆశా కార్యకర్త శారద, స్థానికులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి : ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-బెలగాం: రైలు ఢీకొని శుక్రవారం ఇద్దరు వ్యక్తులు మృత్యువాతపడిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పార్వతీపురం జిఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పార్వతీపురం మునిసిపాలిటీ బంగారమ్మ కాలనీకి చెందిన గద్ద శ్రీహరినాథ్ బాబు(42), తన తల్లి గద్దలక్ష్మిలు పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ వద్ద ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో గూడ్స్ రైలు రావడం గమనించని శ్రీహరినాథ్ రైలు ఢీకొంటున్న సమయంలో తన తల్లి అప్రమత్తమై అతడ్ని లాగేందుకు ప్రయత్నిం చినప్పటికీ రైలు అతడ్ని ఢీకొనడంతో శ్రీహరనాథ్ అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడుని బ్రతికించుకోవాలని చేసిన ప్రయత్నంలో తల్లి లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన శ్రీహరినాథ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మార్చ్యురీకి తరలించారు. ఈఘటనపై జిఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

కురుపాం: రైల్వే స్టేషన్ కి వస్తున్న సమీపంలో ప్రమాదవశాస్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కొమరాడ మండలంలోని చేటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రత్నాకర్ అందించిన వివరాలు ప్రకారం కురుపాం మండలం శివన్నపేట గ్రామానికి చెందిన కొండేటి గౌరీశంకరరావు(39) అనే వ్యక్తి కొమరాడ మండలం గుమడ గ్రామంలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రైల్వేస్టేషన్ కి వస్తున్న సమీపంలో రైలు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. వెంటనే కుటుంబ సభ్యులకు తెలిపి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.ఇతనికి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.6లక్షల కరెన్సీతో అమ్మవారికి అలంకరణ

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు శ్రావణ మాస ఉత్సవాలలో భాగంగా మూడవ శుక్రవారం సందర్భముగా సుమారు 6 (ఆరు) లక్షల రూపాయిలు కరెన్సీ తో అమ్మవారికి అలంకరణ చేయుట జరిగింది అనంతరం సామూహిక కుంకుమార్చనలు అనంతరము లక్ష్మి హోమం చేయుట జరిగింది. కార్యక్రమములో శ్రీ ఇప్పిలి సూర్యప్రకాష్ రావు (గోవింద్) చైర్మన్ ,శ్రీ సూరు వెంకట కుమార స్వామి,వైస్ చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు మరియు భక్తులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలపై ఎంపీడీఓ రామకృష్ణ సమీక్ష

విశాలాంధ్ర-తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఐ.హెచ్.హెచ్.ఎల్.ఎస్., మేజిక్ సోకుపిట్లు, ప్రాధాన్యత కలిగిన భవనాల నిర్మాణాలు, హౌసింగ్ తదితర అంశాలపై ఎంపీడీఓ రామకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు. తదుపరి ఐ.హెచ్.హెచ్. ఎల్.ఎస్. లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగాలని, గతంలో మంజూరైన లబ్ధిదారుల జాబితా, కొత్తగా మంజూరవుతూ వచ్చిన జాబితా రెండూ అందుబాటులో వుంచుకొని క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆమోదం తెలపాలని, క్షేత్రస్థాయిలో అందుబాటులో గల వి.ఓ.ఏ., ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటుగా పంచాయతీ కార్యదర్శులతో మమేకమవుతూ ఖచ్చిత నివేదికలు తయారుచేసుకోవాలని ఆదేశించారు. జగనన్న ఇళ్ళు, ప్రాధాన్యత గల నిర్మాణములు త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా పాలన

విశాలాంధ్ర-నెల్లిమర్ల: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు అన్నారు. నెల్లిమర్ల మండలం కొండ వెలగాడలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. టిడిపి నాయకులు ఎన్నికల ముందు పగటి వేషగాళ్లలా చెబుతున్న కల్లబొల్లి మాటలను నమ్మొద్దని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మొయిద అక్కోజి, పంచాయతీ కార్యదర్శి యర్రా రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వైసీపీ సెక్రటరీగా పోల ఈశ్వర నారాయణ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని సీనియర్ వైఎస్ఆర్సీపీ నాయకుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోల ఈశ్వర నారాయణను ఇటీవల ప్రకటించిన జిల్లా వైఎస్ఆర్సీపీలో సెక్రటరీగా నియామకం చేయటంపట్ల ఎమ్మెల్యే జోగారావు అభినందనలు తెలిపారు.శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పోల ఈశ్వరనారాయణను దుశ్శాలువాతో సత్కరించారు.ఎమ్మెల్యేతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, కీలక నేతలు,మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కన్వీనర్లు ఆయనను అభినందించారు.

పొలంబడిలో మిత్ర, శత్రు పురుగులపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పొలంబడి కార్యక్రమంలో మిత్ర, శత్రు పురుగులను గుర్తించుట, చేపట్టాల్సిన కార్యక్రమాలపై రైతులకు మండల వ్యవసాయాధికారి కె.రవీంద్ర అవగాహన కల్పించారు. మండలంలోని తిమిడి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పొలంబడి ఐదవ వారంలో భాగంగా క్షేత్రస్థాయిలో ఏఈఎస్ఏ కార్యక్రమంలో పొలం పరిసరాల పరిశీలన, మిత్ర పురుగులు, శత్రు పురుగులను గుర్తించడంతో పాటు చార్ట్‌మీద రాసి రైతులకు వివరించారు. ఇక ఆకులను చివరిభాగంలో కత్తిరించుట, (డీటిల్లరింగ్) అధిక సాంద్రతలో పిలకలు వచ్చినచోట పిలకలను తీసివేయుట వంటివి చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్. రవి చంద్ర కుమార్, ఎండీ వివేక్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

విశ్వకర్మ కౌన్సిల్ యోజన అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరంలోని స్థానిక సంతతోట కాలనీలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ నెలవారి సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో విశ్వకర్మ కౌన్సిల్ యోజన జిల్లా కన్వీనర్ అరటి కట్ల హరిబాబు హాజరయ్యారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో చేరేవారు ముందుగా నెల రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని శిక్షణాకాలంలో రోజుకు 500 రూపాయలు చొప్పున స్టైఫాయిడ్ ఇవ్వడం జరుగుతుందన్నారు మరియు శిక్షణ అనంతరం వృత్తి పరమైన పనిముట్లకు రూ.15 వేలు, సర్టిఫికెట్ ప్రధానం చేయడం జరుగుతుందన్నారు ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి అండ్లూరు గణేష్ అధ్యక్షతన జరిగింది మరియు సంఘ సభ్యులు కే అప్పలాచారి సింహాద్రి సన్యాసిరావు దివిలి గౌరీ శంకర్ వేమలి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడప సమస్యలకు దశలవారీగా పరిష్కారం

ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించడం జరుగుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు.శుక్రవారం పట్టణంలోని మద్దాలవారి వీధిలో నూతన పైపు లైను పనులకి శంఖుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు అరవై సంవత్సరములు క్రితం 25వ వార్డు పరిధిలో గల మద్దాల వారి వీధిలో (బొగ్గుల వీధి) వేసిన త్రాగునీటి పైపులైను పాడైపోయిన కారణంగా స్థానిక ప్రజలు నిత్యం మంచి నీటికి ఇబ్బంది పడుతుండటంతో ఆ వార్డు ప్రజల సమస్యలను ఇటీవల కాలంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలుసుకున్న సమస్యలపై వెంటనే స్పందించి నూతన పైపులైను ఏర్పాటు చేసేందుకు, అలానే వార్డులో పలు వీధులలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని అభివృద్ధి పనులను క్రమ పద్ధతిలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరిశ్వరి, వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరి గుణేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంతిని రవికుమార్,మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు, ఏఇ ఆనంద కుమార్, గుత్తేదారు డి తిరుపతి రావు పాల్గొన్నారు.

మూడు నెలలుగా జీతాల్లేవ్..!

- అయోమయ పరిస్థితిలో ఎంఇవో-2ల పరిస్థితి
- ఉద్యోగోన్నతి ఆనందం ఆవిరైన వేళ...

జామి మండల విద్యాశాఖ కార్యాలయం

విశాలాంధ్ర-జామి: వారంతా మూడు నెలల క్రితం ఒక పాఠశాలలో హెచ్ఎం కేడర్‌లో విధులు నిర్వ హించారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని సీనియర్ లుగా గుర్తించి ఉద్యోగోన్నతి కల్పించింది. ప్రతీ మండలానికి ఇద్దరు ఎంఇవోలు ఉండాలనే విధానంలో భాగంగా సీనియర్ హెచ్‌లను ఎంఇవో-2లుగా నియమించింది. ఉద్యోగోన్నతి వచ్చిందనే సంతోషం వారికి ప్రస్తుతం కొంతైనా లేకుండా పోయింది. అందుకు కారణం మూడు నెలలుగా వారికి వేతనాలను ప్రభుత్వం ఇవ్వలేదు. జిల్లాలో పలు పాఠశాలలలో హెచ్ఎంలుగా ఉన్నవారిలో సీనియారిటీ ప్రాతిపదికన ఎంఇవో-2లుగా జిల్లాలోని 27మండలాలకు 27మందిని ప్రభుత్వం నియమించింది. ఈనియామకాలు జరిగి 3నెలలు గడిచాయి. అయితే ఇప్పటి వరకు వారికి చేయాల్సిన విధులు జాబ్‌చార్ట్‌ను తెలియజేయ లేదు. సరికదా వారికి జీతాలను కూడా ఇవ్వలేదు. దీంతో వారంతా మండల విద్యాశాఖ కార్యాల యానికి వచ్చి ఎంఇవో ఓచోట కుర్చీ వేసుకుని కూర్చునే పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ఎంఇవోకు పాఠశాలల విజిట్‌తో పాటు మధ్యాహ్న భోజన నిర్వహణ పరిశీలన, విద్యార్థుల ఆన్‌లైన్ ప్రక్రియ వంటి పనులు ఉంటాయి. కానీ వీటిలో ఏఒక్క బాధ్యతలను ఎంఇవో-2కు ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో ఆయా అధికారులే తమకు పనులు కల్పించుకుంటున్నారు.

హెచ్ఎంలుగానే బాగుంది..

గతంలో హెచ్ఎంలుగా ఉన్న సమయంలో విద్యార్థులకు విద్యబోధన చేస్తూ విధులు నిర్వహించేవారమని, అప్పుడే ఆనందంగా ఉండేదని పలువురు వాపోతున్నారు. ఉద్యోగోన్నతి సంతోషం లేకుండా ప్రభుత్వం చేసిందని ఆవేదన చెందుతున్నారు. గతంలో పనిచేసిన పాఠశాలనుంచి రిలీవ్ కావడంతో అక్కడనుంచి జీతాలు వచ్చే అవకాశం లేదు. ఇప్పుడు నూతన ఉద్యోగాలలో చేరినందుకు వేతనాలు లేకపోవడంతో ఎంఇవో-2లు అంతా కక్కలేక, మింగలేక ఉన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో తమ్మన్న శెట్టి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరంలోని 40వ డివిజన్ కంటోన్మెంట్ బొగ్గులదెబ్బ ప్రాంతం నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కోలగట్ల తమ్మన్న శెట్టి పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపైన ఆరాతీశారు. అర్హత ఉండి పథకాలు పొందలేని వారి వివరా లను తెలుసుకుంటూ అందుకు గల కారణాలను కూడా వివరిస్తూ ముందుకుసాగారు. అనంతరం కోలగట్ల తమ్మన్న శెట్టి, స్థానిక కార్పొరేటర్ ధనలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధన్యులని అన్నారు. అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తుండడంతో సంక్షేమపాలనకు శ్రీకారం చుట్టినట్లు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి దూబే, వైసీపీ నాయకులు గాలి భాస్కరరావు, మురళి, డివిజన్ ఇంచార్జ్ వాసుదేవరావు, మహిళా అధ్యక్షురాలు నందిని, యువ జన విభాగం అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ జనసేన మూల సిద్ధాంతం

జనసేన నాయకులు గురాన అయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జనసేన సిద్ధాంతాల్లో ముఖ్యమైన సిద్ధాంతం పర్యావరణ పరిరక్షణ అని, ప్రజలు బాగుంటేనే సమాజం బాగుంటుందని, సమాజం బాగుండాలంటే ప్రజలందరూ పర్యావరణాన్ని పరిరక్షించు కోవాలని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. జనసేన అదినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా విజయనగరం పట్టణంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం పట్టణంలో పేర్ల వారి వీధిలో చెవిటి మూగ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ పాకెట్స్ , స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత గురాన అయ్యలు మాట్లాడుతూ జనసేన అదినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసైనికులు ఘనంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని,సమాజం లో పవన్ కళ్యాణ్ లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని, అతను సమాజం కోసం ఎన్నో మంచి పనులు చేశారని, నిరంతం ప్రజల మంచి కోసం ఆలోచించే వ్యక్తి అని పేర్కొన్నారు, పవన్ కళ్యాణ్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపు కోవాలని ఆలాగే ప్రజల కోసం మరెన్నో మంచి కార్యక్రమాలు చేయాలని ,ప్రజలకు మరింత సేవచేసే భాగ్యం పవన్‌కళ్యాణ్ కి త్వరలోనే వస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు టి.రామకృష్ణ, కాటం అశ్విని, రాజేంద్ర, రవితేజ, పిడుగు సతీష్, రవీంద్ర, ముదిలి శ్రీనివాసరావు, జె. మోహన్‌రావు, వజ్రపు నవీన్, పవన్‌కుమార్, అభిలాష్, గొల్లపల్లి మహేష్, సురేష్ కుమార్, భార్గవ్, అడబాల వేంకటేష్, సాయి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఇఎల్ఆర్ పేరుతో విద్యుత్ కోతలు అన్యాయం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఈఎల్ఆర్ పేరుతో విద్యుత్‌కోతలు విధించడం అన్యాయమని విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిత్యవసర ధరలు తగ్గించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని సచివాలయ ఎదుట పలువురు మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో రాత్రిపూట సుమారు రెండు గంటలపైగా విద్యుత్‌కోతలు విధిస్తున్నారని దీనివలన రాత్రిపూట ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పెంచిన విద్యుత్ చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సచివా లయ కార్యదర్శులకు సంతకాలతో సేకరించిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ పట్టణ కమిటి సభ్యులు రెడ్డి శ్రీదేవి, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, రాజశేఖర్ మరియు పార్టీ సభ్యులు గెద్ద తులసి, మాన్యం గౌరమ్మ పాల్గొన్నారు.

కావాలనే అయ్యన్నను హింసిస్తున్నారు ...

ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-కొత్తవలస: సెప్టెంబర్ 1 తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుని పోలీసులు అదుపులోకి తీసకొని మానసికంగా హింసించడమే జగన్మోహన్ రెడ్డి ధ్యేయంగా పెట్టుకున్నారని ఎస్‌కోట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మండిపడ్డారు. శుక్రవారం తాళ్లపాలెం వద్ద అయ్యన్నపాత్రుని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించారనే వార్త తెలియగానే ఎస్ కోట నియోజకవర్గ టిడిపి నేతలు భగ్గుమన్నారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని నెపంతో అయ్యన్నపాత్రుడుని అదుపులోకి తీసుకోవడం దారుణమని కోళ్ల లలిత కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రతిపక్ష నేతగా జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు చంద్రబాబుపై ఉరితీయండి, కాల్చి చంపేయడం వంటి మాటలు పోలీసులకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. అధికార మదంతో మంత్రులు చంద్రబాబు నాయుడు ఆయన కుటుంబం పై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు పోలీసు వ్యవస్థ నిద్రపోతుందా అని ప్రశ్నించారు. అయ్యన్నను ఎంత హింస పెడితే జగన్ అంత నష్టపోతారని ఆమె పేర్కొన్నారు సాయంత్రం ఆమె నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పై విధంగా స్పందించారు.

మాజీ జెడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు షష్టిపూర్తి వేడుకలు



విశాలాంధ్ర-దత్తిరాజేరు: మాజీ జెడ్పీటీసీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పల నాయుడు, ఉషారాణి దంపతుల షష్టిపూర్తి వేడుకలు స్వగ్రామం టీ బూర్జవలసలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుమారులు క్రాంతి కుమార్, నరేష్, కుమార్, కుమార్తె స్రవంతి, మరియు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో షష్టిపూర్తి మహోత్సవం వైభవంగా జరిగింది. ఎంపీ బెల్లాన్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, ఈ వేడుకల్లో దంపతులను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 1984 లో వివాహం చేసుకొని నాటి నుండి నేటి వరకు సేవా భావంతో రాజకీయాల్లో ఉన్నతమైన పదవుల్లో కొనసాగుతూ వస్తున్నారన్నారు. భర్తకు తగిన భార్యగా ఆమె సేవలు చేస్తూ భార్యాభర్తలిద్దరూ ప్రతినిధులుగా ప్రజలకు సేవలందించడం గొప్ప అదృష్టం అని దంపతులిద్దర్నీ కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెలు సింహాద్రి అప్పలనాయుడు, జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు వైసీపీ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

భారీ టేకు చెట్టు నరికివేతపై నెలకొన్న వివాదం...!

- పర్యావరణ ప్రేమికుడు రామకృష్ణ కోర్టును ఆశ్రయించినట్టు సమాచారం



విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని విశాఖ-అరకు మెయిన్ రోడ్డును ఆను కుని ఆకుల డిపో సమీపంలో ఆర్ అండ్ బి హద్దులో ఉన్న భారీ టేకు చెట్టు నరికివేతపై శుక్రవారం వివాదం నెలకొంది. ఈ టేకు చెట్టు నరికివేతకు ముందు ఒక ఆసామి ఆర్ అండ్ బి, రెవెన్యూశాఖ అధికారుల వద్ద నుండి అనుమతి తీసుకున్నప్పటికీ భారీ చెట్టు నరికివేతకు గల కారణం సహేతుకంగా లేదని పర్యావరణ ప్రేమికుడు, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ కోర్టును ఆశ్రయించినట్టు సమాచారం. ఈ వివాదానికి సంబంధించి.. ఎస్.కోట తహశీల్దార్ ఇచ్చిన అనుమతిపత్రంలో ఆ చెట్టును తొలగించమని ఇచ్చిన ఉత్తర్వుల్లో ఆ ఇంటి యజమాని తండ్రి పేరు కూడా తప్పుగా ఉందని, పైగా ఈ చెట్టు వల్ల ఆ ఇంటికి ఎటువంటి ముప్పు లేదని, పిడుగుపాటుకు చెట్టు చిగురు పాడైనప్పటికీ మిగిలిన భాగం చాలా పచ్చగా కొమ్మ లతో ఉందని, ఇలాంటి భారీ చెట్టును తొలగించడమంటే ప్రకృతిని నాశనం చేసేసినట్టేనని ఆ వ్యక్తి ఆందోళన వ్యక్తంచేసినట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని చెట్టు తొలగించే సందర్భంలో అక్కడి వారిని కోర్టును ఆశ్రయించిన వ్యక్తి ప్రశ్నించారని కూడా తెలిసింది. రామకృష్ణ అనే పర్యావరణ ప్రేమికుడు చెట్టు తొలగింపునకు ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు, చెట్టు నరికిన పలువురు వ్యక్తులపై కోర్టుకు వెళ్లినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ నరికిన టేకు చెట్టును ఆర్ అండ్ బి అధికారులు స్వాధీనం చేసుకుని విశాఖపట్నం తరలించినట్టు చెబుతున్నారు.

గ్రంథాలయ సంస్థల పన్ను బకాయిలు చెల్లించాలి..

విశాలాంధ్ర-శృంగవరపుకోట : జిల్లాలో పంచాయతీలు వసూలు చేస్తున్న గ్రంథాలయపు పన్నును వెంటనే జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని జన జాగృతి సంస్థ ఉత్తరాంధ్ర జిల్లా కన్వీనర్ శీరాపు శ్రీనివాసరావు జిల్లా కలెక్టరుని కోరారు. ఆయన పోతనాపల్లి జంక్షన్ వద్ద స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. జిల్లాలోని పంచాయితీలు ఇంటి పన్నుతో పాటు వసూలు చేస్తున్న గ్రంథాలయపు పన్ను గత కొన్నేళ్లుగా గ్రంథాలయ సంస్థకు జమ చేయడం లేదన్నారు. ఈ మేరకు తాను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'జగనన్నతో చెబుదాం' అనే కార్యక్రమంలో అధికారులకు అర్జీ అందజేశానని చెప్పారు. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పక్కాగా అమలుపరచాలని కోరారు. దరఖాస్తు దారుడు సెక్షన్(1) ప్రకారం పిఐఓలకు అందజేసిన దరఖాస్తునకు 30 రోజుల్లోగా సమాచారం ఇవ్వవలసి ఉండగా సకాలంలో సమాచారం ఇవ్వడం లేదని (కొందరు సమాచారం సకాలంలో ఇస్తున్నారని) శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తంచేశారు. సమాచారం సకాలంలో రానందు వల్ల దరఖాస్తుదారుడు సెక్షన్ 19(1)ప్రకారం ప్రథమ అప్పీలు చేస్తున్నాడని, అలాగే సెక్షన్ 19(3) ప్రకారం సమాచార కమిష నరుకి రెండో అప్పీల్ చేస్తున్నాడని ఆయన అన్నారు. సమాచార హక్కు చట్టం 2005, అమలు తీరుతెన్నులు అనే అంశంపై నెలలో ఏదో ఒకరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల పిఐఓలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆయన ఆ అర్జీలో కోరారు. 1980 జనవరి ఒకటో తేదీ నుండి ఈరోజు వరకు దాడులు ఎన్ని జరిగాయి, అలాగే చిల్లంగి పేరిట హత్యలు, దాడులు ఎన్ని జరిగాయి ?, అలాగే గ్రామ బహిష్కరణలు ఎన్ని జరిగాయి? అలాగే గుప్త నిధుల కోసమని జిల్లాలో నరబలులు ఎన్ని జరిగాయి? అనే అంశంపై సర్వే జరపాలని శీరాపు కోరారు. ఆంధ్రప్రదేశ్ లో మూఢనమ్మకాలను నిరోధక చట్టం చేయాలని ప్రభుత్వాన్ని శీరాపు శ్రీనివాసరావు కోరారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగనన్న ప్రభుత్వం

గడప గడపకు ప్రభుత్వంలో ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పేదల జీవితాల్లో జగనన్న ప్రభుత్వం సంతోషం నింపుతోందని, ఏ ఒక్క అర్హుడికి సంక్షేమ పథకం అందలేదనే ఆరోపణ లేకుండా వైఎస్సార్సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట పట్టణంలోని 4వ గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం' ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు, ప్రస్తుత వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలన, గత ప్రభుత్వ పాలనా వ్యత్యాసాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం మెచ్చుకున్న విషయంతో పాటు పలు రాష్ట్రాలు కూడా వారి రాష్ట్రాల్లో అమలుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలతో పాటు ఇంకా ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి పంపిన లేఖను అందజేస్తూ, మూడేళ్ళలో దేవుడి దయతో, మీ అందరి చల్లని చూపులతో మంచి చేసామని, ఇక ముందు కుడా మంచి చేస్తామని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకట రమణ, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, పంచాయతీరాజ్ జోనల్ ఇంచార్జ్ మెరపల సత్యనారాయణ, జెసిఎస్ మండల ఇంచార్జ్ వాకాడ సతీష్, పుణ్యగిరి ట్రస్ట్ చైర్మన్ పి.రామకృష్ణ, బొడ్డు వెంకటరమణ (శ్రీను), ఏఎంసీ డైరెక్టర్ పార్వతి, ఎంపీటీసీలు కడారి అప్పయ్య, వార్డు సభ్యులు కోసూరి భారతి, గనివాడ శ్రీను, పాపారావు పాలు రాము, మామిడి శంకర్ (బుజ్జి), కడారి జయశంకర్, మోపాడ కోటి, మోపాడ ఈశ్వర నాయుడు, పెంట గణేష్, సీతంపేట అప్పల సత్యం, ఒబ్బిన బంగారు నాయుడు, తిమ్మిడి ఎంపీటీసీ ధర్మారావు, వీరనారాయణ సోంబాబు, ఎస్ కోట తలారి అనంత, సూరాతి కృష్ణమ్మ, వసి ఒబ్బిన బంగారు నాయుడు, ఎంపీటీసీ గుమ్మడి సన్యాసప్పుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి : సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న పేదలకు గొప్ప వరం లాంటిదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పేర్కొన్నారు. బొబ్బిలి నియోజకవర్గం తెర్లాం మండలం బూరిపేట గ్రామానికి చెందిన టంపల సాంబరావు పాపకి 2లక్షల రూపాయలు, మరియు రామభద్రపురం మండలం కొండకేంగువ గ్రామానికి చెందిన కోట షణ్ముఖ సాయితేజ కు 1లక్ష 20వేల రూపాయలు చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. అన్నివర్గాల పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల నాయుడు,వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, బూరిపేట సర్పంచ్ బూరి మధు, వైసీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

లక్ష్మిపురంలో బాబు ష్యూరిటి -భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం ప్రారంభం

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-సీతానగరం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు శుక్రవారం నుండి ప్రారంభమైన బాబుష్యూరిటి - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర, టీడీపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్ ఆధ్వర్యంలో లక్ష్మిపురంలో ప్రారంభించారు.గ్రామానికి విచ్చేసిన నేతలకు లక్ష్మిపురం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.టీడీపి జెండాను ముందుగా ఎగురవేశారు.ఉత్సాహంగా టిడిపికు మద్దతుగా నినాదాలు చేస్తూ రెండు ఊర్లలోమేలాలతో పాదయాత్రచేశారు. స్థానిక రామ మందిరం వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ముందుగా పార్టీలోకి వచ్చిన వంద కుటుంబాలకు చెందిన పలువురు నాయకులకు,మహిళలకు టీడిపి కండువాలువేసి పార్టీలో చేర్చుకున్నారు. ఈసందర్భంగా శుక్రవారంనుండి ప్రారంభ మయిన బాబు ష్యూరిటి- భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమ గోడపత్రికలను ఆవిష్కరణ చేశారు.ఈసమావేశంలో నియోజకవర్గ ఇంచార్జి విజయ్ చంద్ర, మాజీఎమ్మెల్సీ జగదీష్ లు మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలలో టీడీపీ విజయంకోసం ప్రతీ ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.మహిళలకు ఉచిత ఆర్టీసీప్రయాణం, పేద కుటుంబానికి సంవత్స రానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, నిరుద్యోగ భృతి కింద 3వేలరూపాయలు ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితకొళాయి సదుపాయం, ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకి నెలకి 15 వందల ఆర్థికసాయం,అన్నదాత పథకం కింద ప్రతి రైతుకి సంవత్సరానికి 20వేల రూపాయలు ఆర్థికసాయం,తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి 15 వేలరూపాయలు ఆర్థిక సాయం,యువగలం పథకం కింద 20 లక్షల ఉద్యోగ కల్పన, టీడీపీ కొత్తగా ప్రకటనచేసిన మ్యానీఫెస్టో కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ డి.శ్రీదేవి, , బార్నాల సీతారాం, పోల సత్యనారాయణ, కోరాడ నారాయణరావు, మండలనాయకులు కొల్లి తిరుపతిరావు, సాల హరి, బుడితి శ్రీను, సబ్బాన శ్రీను, గుంపస్వామి, దాసరి సింహాచలం,రమేష్, బుడితి గోపాల కృష్ణ,వెంకటనాయుడు,శేఖర్, భాస్కరరావు, పెంట సత్యంనాయుడు, సురేష్ , రెడ్డిసింహాచలంతోపాటు లక్ష్మిపురం గ్రామానికి చెందిన చప్పసింహాచలం, చప్పవిజయమ్మ, చిన్నంనాయుడు, చప్పసుధా, గవర భాస్కరరావు, చందక ఉమా, బోను శ్రీనివాసరావు,బాల, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు, నిర్ధారణ పక్కాగా జరగాలి

విశాలాంధ్ర-పాలకొండ: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆరోగ్య తనిఖీలు, నిర్ధారణ పరీక్షలు పక్కాగా జరపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు సూచించారు. వండువ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఏ విధమైన అనారోగ్య సమస్యలున్న వారికి తనిఖీలు చేపట్టారు, ఏ విధమైన చికిత్స అందజేస్తున్నారు, నిర్ధారించిన పరీక్షల నివేదికలు పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. తనిఖీలకు వచ్చిన గర్భిణీలు, బాలింతలతో మాట్లాడి వైద్య సిబ్బంది అందజేస్తున్న ఐరన్, కాల్షియం మాత్రలు వారు సూచించిన క్రమంలో వేసుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో అందజేస్తున్న పోషకాహారాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.104 వాహనం వద్దకు వచ్చే రోగులకు ఎన్ సిడి, సిడి ఐడి నంబర్లు ఇచ్చేట్లు చూడాలని, రక్తపోటు, మధుమేహం గల వారికి పక్కాగా పరీక్షలు నిర్వహించి, నెలకు సరిపడా మందులు అందజేయాలని సూచించారు. ఇతర రుగ్మతలతో వచ్చే రోగులకు యూరిన్, కఫం పరీక్షలు జరిపి తగిన మందులు ఇవ్వాలని ఆదేశించారు.

- డ్రైడే కార్యక్రమాల పరిశీలన: పాలకొండలో పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది నిర్వహించిన డ్రైడే కార్యమాన్ని డిఎమ్ హెచ్ఓ డాక్టర్ జగన్నాథరావు పరిశీలించారు. వైద్య బృందంతో కలసి ఇంటింటి సర్వే లో ఆయన పాల్గొని ప్రజలతో మమేకమై దోమల పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో, ఫ్రైడే-డ్రైడే కార్యక్రమ ఉద్దేశ్యం ప్రజలకు వివరిస్తూ దోమల లార్వాలు పెరగకుండా ఇంటిలో ఉన్న పూలకుండీలు, రుబ్బురోలు, పగిలిపోయిన వస్తువులు, ఫ్రిడ్జ్ ల్లో ఉండిపోయిన నీటిలో దోమలు గ్రుడ్లు పెట్టి, వృద్ధి చెందుతాయని వారానికి కనీసం ఒక్కసారైనా నిల్వ ఉన్న నీటిని పారబోసి శుభ్రపర్చుట వలన దోమల వ్యాప్తిని నివారించి మలేరియా, డెంగ్యూ మొదలగు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బిటివాడ పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ నితీషా, సూపర్ వైజర్ ఇందిరాదేవి, డెమో వై.యోగీశ్వర రెడ్డి, ఎస్ యుఒ మోహనరావు, సూపర్ వైజర్స్ జగదీష్, రమణమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడలో శనివారం ఉదయం స్వర్గీయ దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్తు అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు సతీష్ తెలిపారు. వేపాడ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరుగుతుందని కావున మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పార్టీ అధ్యక్షులు వివిధ హోదాలో ఉన్నటువంటి డైరెక్టర్లు చైర్మన్ లు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

వైద్య సేవలు ప్రజలకు అందాలి

విశాలాంధ్ర - బెలగాం/పాలకొండ/గరుగుబిల్లి : ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న అన్ని వైద్య సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, చేరువయ్యేలా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు సూచించారు. గరుగుబిల్లి, రావివలస, వీరఘట్టం, బిటివాడ, అన్నవరం, ఎం. సింగుపురం పి హెచ్సిలు, పాలకొండ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో ఆయన పలు ఆరోగ్య కార్యక్రమాలపై గరుగుబిల్లి, పాలకొండలలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి ఆరోగ్య కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించి, పూర్తిస్థాయిలో వైద్య సేవలు చేరువయ్యేలా వైద్య సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. ప్రోగ్రాం అధికారులతో కలసి అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై ఆయా సచివాలయాల వారీగా నివేదికలను పరిశీలించి సమీక్ష జరిపారు. పురోగతి తక్కువగా ఉన్న వారిని అందుకు గల కారణాలపై ఆరా తీసి, పురోగతి సాధించాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సేవలన్నీ గ్రామీణ ప్రజలకు వినియోగించాలన్నారు. ఎస్డిజి లక్ష్యాలైన గర్భిణీలు, ఐదేళ్ళ లోపు పిల్లలు, కిశోర బాలికల్లో రక్తహీనత అధిగమించాలన్నారు. ఇ-ఆశా యాప్ ను ప్రతి రోజూ ఆశా కార్యకర్తలు ఉపయోగించి, సూచించబడిన ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు జరిగేలా చూడాలని, పిహెచ్సిల్లో ప్రసవాలు జరగాలని, సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్ళలోపు పిల్లల్లో డ్రాప్అవుట్స్, లెఫ్ట్ అవుట్స్ గుర్తించి మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమంలో వారికి టీకా పూర్తి చేయాలన్నారు. గర్భిణీలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలైన పిఎంఎంవివై, జెఎస్ వై, జెఎస్ఎస్ కె, ఆరోగ్య ఆసరా మొదలగునవి అర్హులకు అందేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది అందు బాటులో ఉండాలని, విధి నిర్వహణల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహన రావు, డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ విజయపార్వతి, ఎఫ్ డిపి నోడల్ అధికారి డాక్టర్ వినోద్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ నవీన్, వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, ఎఎన్ఎంలు, పాల్గొన్నారు.

కేజీబీవిలో విజయదుర్గ యూత్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విజయ దుర్గ యూత్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విజయనగరం కేజీబీవి వసతి గృహంలో బాలికలకు క్రీడలు పోటీలు నిర్వహించడము జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యఅతిథిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ శ్రీ కేసలి అప్పారావు అప్పారావు పాల్గొని సంస్థ చైర్ పర్సన్ శ్రీమతి కేశవపట్నం జయలక్ష్మి చేతులు మీదుగా విజేతలుగా నిలిచిన వారికి బహుమతులును మరియు ప్రశంసా పత్రాలును అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విజయ దుర్గ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో గత రెండు సం.గా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు సంతృప్తికరంగా చేస్తున్నారని, రక్త దానం,అన్న దానం, మొక్కలు నాటే కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు, యువత, విద్యార్థులుకు, బాలలు హక్కుల పరిరక్షణ కోసం పాటశాల, కళాశాల స్థాయిలో అవగాహణ కల్పించడం మొదలగు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీ యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ దుర్గ యూత్ సొసైటీ చైర్ పర్సన్ జయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు చదువు కోసం ,వారి రక్షణ మరియు సంరక్షణ కోసము విజయ దుర్గ యూత్ సొసైటీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ రెండు సం. కాలంలో సొసైటీ చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాల కు అన్ని రకా లుగా సహాయ సహకారాలు అందించిన అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిదులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు కు ధన్యవాదాలు తెలుపుకుంటు న్నామన్నారు. మూడవ వార్డు కార్పొరేటర్ శ్రీ వజ్రపు సత్య గౌరీ మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు కలిగిన విద్యను అభ్య సించాలన్నారు. పట్నాల భవాని, వీవీ పద్మనాభం మాట్లాడుతూ బాలికలు అందరూ చదువుతో పాటు క్రీడలు, నృత్యం, పాటలు, శిక్షణా కార్యక్రమాలు మొదలగు వారి అభిరుచి మేరకు పాల్గొని నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవి ప్రిన్సిపల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

4 సచివాలయాల్లో పింఛన్ల పరిశీలన

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని సింగరాయి, ఆతవ, వల్లంపూడి, బానాది సచివాలయాను శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి కూర్మనాద్ పట్నాయక్ సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో నూతనంగా మంజూరైన పింఛన్ల దస్త్రాలను పరిశీలించారు. అలాగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై సమీక్ష జరిపారు, అలాగే ఆతవ సచివాలయంలో జి జి ఎంపీ నిధులతో చేస్తున్న పనులను పరిశీలించారు, అలాగే చెత్త సంపద తయారీ కేంద్రంను సందర్శించి చెత్త నుండి సంపద సృష్టించడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆతవ సర్పంచ్ గొంప వేమన రాము, వైసీపీ నాయకులు నాగిరెడ్డి జగన్ కెర్రి దేముడు, నాగరాజు పంచాయతీ కార్యదర్శులు నాని బాబు కన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలసీదారులకు నమ్మకమైన, మెరుగైన సేవలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పాలసీదారులకు నమ్మకమైన, మెరుగైన సేవలు అందించడంలో జీవితబీమా సంస్థ (ఎల్ఐసి) ముందంజలో ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్రావు అన్నారు. 67వ జీవిత బీమా వారోత్సవాలను శుక్రవారం ఆయన విజయనగరం బ్రాంచ్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్రావు మాట్లాడుతూ ఒక సేవా సంస్థ మాదిరిగా పాలసీదారుల సంక్షేమం కోసం ఎల్ఐసి నిరంతరం కృషి చేస్తుందని కొనియాడారు.కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పాలసీదారుల పక్షాన రక్షణ కవచంగా నిలిచి ఎక్కడా ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు అండగా నిలిచిందని చెప్పారు. ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా డెత్ క్లైమ్ లను సకాలంలో పరిష్కరించిన ఘనత ఎల్ఐసి దేనని అన్నారు. అందరి సహకారంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థగా గుర్తింపు పొందిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ నారాయణరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అంజయ్య, ఎఓ కట్టమూరి భాస్కర రామమూర్తి, జీవిత బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, సీనియర్ డవలప్ మెంట్ ఆఫీసర్లు జి.రవిశ్రీనివాస్, ఎంఎల్ శ్రీనివాస్, జెవి నాగరాజు, సునీల్ కుమార్ రతో, ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాలకు గోధుమ పిండి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : జిల్లాలో పార్వతీపురం, పాలకొండ, సాలూరు మున్సిపాలిటీల గ్రామీణ ప్రాంతాలకు పోర్టిఫైడ్ చక్కి గోధుమ పిండిని సెప్టెంబరు నుండి సరఫరా చేయడం జరుగుతోందని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురంలో 11,325, పాలకొండలో 7,890, మరియు సాలూరులో 13,736 వెరసి మున్సిపాలిటీలోగల 32,951 తెల్ల కార్డుదారులకు ఒక్కొక్క కార్డుకు కిలో 16/- చొప్పున పోర్టిఫైడ్ చక్కి గోధుమ పిండి జులై-2023 నెల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

భిన్న సంస్కృతుల సమ్మేళనమే మన భారతదేశం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : భారత ప్రధాని నరేందర్ మోడీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి ఈ నెల 15 వరకూ దేశ వ్యాప్తంగా ప్రారంభమైన మేరీ మాట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ మన భారత దేశం భిన్న మతాలు, భిన్న కులాల, వివిధ సాంప్రదాయల, భిన్న సంస్కృతుల సమ్మేళనమే మన భారత దేశం అని ఇలా వివిధ ప్రాంతాలు, వివిధ గ్రామాలు, వివిధ రాష్ట్రాలు, వివిధ మతాలు, వివిధ కులాలు ఒకటే అని చాటి చెప్పి అందరిలో ఐక్యత పెంచాలనే ధృడ సంకల్పంతో వివిధ గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి మట్టి సేకరించి ఒక అమృత వనాన్ని రూపొందించి మనమంతా ఒక్కటే అని చాటి చెప్పే ప్రయత్నమే ఈ మన మట్టీ - మన దేశం అనే కార్యక్రమంఅన్నారు. గతంలో 2012 లో కూడా ఇలా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భిన్న భిన్న సంస్కృతుల వ్యక్తుల నుంచి వారి పాత లేదా పాడయిన లేదా విరిగిపోయిన ఇనుము, రాగి, ఇత్తడి, సిల్వర్ ఇలా వివిధ లోహాలను ప్రాంతాల వారీగా సేకరించి ఆ 1948 రోజుల్లో స్వాతంత్ర్య భారతావనిలో వివిధ సంస్థానాలను విలీనం చేయించుటకు ఎంతో కృషి చేసిన స్టేట్యూ ఆఫ్ యూనిటీ ఐరన్ మేన్ గా పేరు గాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని కూడా 2016 లో గుజరాత్ లో రూపొందించడం జరిగింది అని పేర్కొన్నారు. కావున ప్రతీ ఒక్కరం రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఇంటి నుండి పిడికెడు మట్టి ఒక కలశ కుండలో సేకరించి వాటిని అమృత వనాల నిర్మాణానికి ఢిల్లీ పంపించడానికి భారతీయ జనతాపార్టీ సేవకులు అందరూ నడుం బిగించుటకు పూనుకున్నారు అని కావున ప్రజలు అందరూ మా బీజేపి సేవకులకు సహకరించి ఈ అమృత వనాల నిర్మాణానికి తోడ్పాడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావనీ, జిల్లా ఇంఛార్జి రామరాజు,నట్టికుట్టి ఈశ్వరరావు, గద్దె బాబూరావు, శివప్రసాద్ రెడ్డి, బొబ్బిలి శ్రీను, దంతినాడ అప్పలాచారి, ఇమంది సుధీర్, గండికోట శాంతి, గిరిబాబు, సీతారాం, నవీన్, జమ్ము రాంబాబు, సోము మహేష్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో బూరిపేట గామాని బిసిఎం సహాయనిధి ఆపదలో ఉన్న పేదలకు గొప్ప వరం లాంటిదని బొబ్బిలి ఎమ్మెల్యే శ్రీ శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పేర్కొన్నారు.బొబ్బిలి నియోజకవర్గం తెర్లాం మండలం బూరిపేట గ్రామానికి చెందిన టంపల సాంబరావు పాపకి 2లక్షల రూపాయలు, మరియు రామభద్రపురం మండలం కొండకేంగువ గ్రామానికి చెందిన కోట షణ్ముఖ సాయితేజ కు 1లక్ష 20వేల రూపాయలు చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు.అన్ని వర్గాల పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు పెద్దపీట వేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, బూరిపేట సర్పంచ్ బూరి మధు, వైసీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఐటిఐ నిర్మాణం కొరకు అప్రూవల్ కావాలి

విశాలాంధ్ర - సాలూరు టౌన్ : ప్రభుత్వ ఐటిఐ స్థలం కు అప్రూవల్ కావాలని చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, జజ్జావు దీప్తి వైస్ చైర్ పర్సన్ కు వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం సాలూరు పట్టణం ప్రభుత్వ ఐటిఐ ఎకరా1/2 స్థలానికి పురపాలక సంఘం నుంచి అప్రూవల్ కావాలని ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కోరారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ నిర్మాణం కొరకు గుమడాం వద్ద పాత ఎమ్మార్వో సర్వే చేసి ఎకరా1/2 స్థలాన్ని అప్పగించారు.మన సాలూరులో ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ ఐటిఐ అనాధికారికంగా నడుస్తుంది అన్నారు. దీనివల్ల విద్యార్థులకు సరైన విద్యను అందించలేక పోతున్నారు.కావున ప్రభుత్వ ఐటిఐ స్థలం విషయంపై సాలూరు పురపాలక సంఘం కౌన్సిలర్ సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరి ఆమోదంతో మీకు నిర్మాణం కొరకు అప్రూవల్ తొందరలో ఇస్తాము అని తెలియజేశారు.

లంకెలచెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

గిరిజన సంఘాల డిమాండ్

విశాలాంధ్ర - కురుపాం : కురుపాం మేజర్ పంచాయతీ ఉన్న లంకెల చెరువు ఆక్రమణలపై రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు తక్షణమేచర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గిరిజనాభ్యుదయ సంఘం, ట్రైబల్ రైట్స్ ఫోరం నాయకులు ఆరిక. చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక లంకెలు చెరువు ఆక్రమణ పై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరిన సందర్భంగా మాట్లాడుతూ చెరువు యొక్క విస్తీర్ణం పరిశీలన చేసి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. చర్యలు లో నిర్లక్ష్యంగా ఉన్న పక్షంలో దీనిపై ఉన్నత అధికారులకు పిర్యాదు చేస్తామని తెలిపారు.

స్వచ్ఛత పక్వాడ ప్రతిజ్ఞ నిర్వహణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : స్వచ్ఛత పక్షోత్సవంలో భాగంగా ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం ప్రతిజ్ఞను ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించి నట్లు హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్వచ్ఛ విద్యాలయం, స్వచ్ఛ గ్రామం నిర్వహణ క్రమం మనందరం కట్టుబడేటట్లు ప్రతిజ్ఞ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన మీదట శుక్రవారం ప్రార్థన సమయంలో స్వచ్ఛత ప్రతిజ్ఞను పాఠశాల సిబ్బంది కార్యదర్శి వేమన ఈశ్వర సత్యనారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులచే ప్రతిజ్ఞను నిర్వహించారు. ఇందులో భాగంగా మన తరగతి గదులను, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుతామని, మన వీధులను, గ్రామాలను స్వచ్ఛ విద్యాలయాలుగా, స్వచ్ఛ గ్రామాలయాలుగా మారుస్తామని ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3 నుంచి మాసోత్సవాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ అద్వర్యంలో ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ నెలలో జరిగే యువజన మాసోత్సవాలు ఈ నెల మూడవ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి అని ఈ యువజన మాసోత్సవాలో సుమారు 15 వేల మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొంటారని దీనికి గాను ఏడు లక్షల రూపాయల వరకు ఖర్చు చేయనున్నామని యూత్ సర్వీస్ డైరెక్టర్ బలభద్రుని అశోక్ అన్నారు. శుక్రవారం రోటరీ హెల్త్ సెంటర్ లో జరిగిన పత్రికా సమావేశంలో యువజన మాసోత్సవాలు చైర్మన్ శంకర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు ఉడతా రాజేష్, కార్యదర్శి అరుణ్ సోదానిలు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులలో ఉన్న ప్రతిభని వెలికి తీసేందుకు రోటరీ క్లబ్ ఒక వేదిక అని సెప్టెంబర్ మూడవ తేదీన ప్రారంభించి సాంస్కృతిక క్రీడా సామాజిక కార్యక్రమాలలో విభిన్న పోటీలు నిర్వహించి అక్టోబర్ రెండవ తేదీ వరకు 20 పోటీలు నిర్వహించి అక్టోబర్ రెండవ తేదీ రోటరీ జిల్లా గవర్నర్ దత్త సుబ్బారావు చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేయనున్నామన్నారు. ఇప్పటికి 34 సంవత్సరాల నుండి నిరంతరాయంగా రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆద్వర్యంలో యువజన మాసోత్సవాలు నవతా రోత్సవమ్ పేరిట చేస్తున్నామని తెలిపారు. పూసర్ల మారుతి భువన్. కెఆర్ కె.రాజు ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న అభ్యుదయ విద్యాసంస్థల అధినేత నాని సతీమణి శారదా

విశాలాంధ్ర - బొబ్బిలి : నిన్న సింహాచలం మెయిన్ రోడ్లో ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ బోల్తా పడిన సంఘటనలో క్షతగాత్రున్ని మానవత్వంతో రోడ్డు వైపు వెళ్తున్న అభ్యుదయ సంస్థ అధినేత మర్రపు కూర్మనాయుడు నాని సతీమణి చింతా శారద ప్రమాద సంఘటన చూసి క్షతగాత్రుడుకు ప్రథమ చికిత్స అందించి మానవత్వాన్ని చాటుపడంతో స్థానికులు అభ్యుదయ విద్యాసంస్థల అధినేత మర్రపు కూర్మనాయుడు నాని సతీమణి చింతా శారద కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఆర్అండ్బీ బంగ్లా కనుమరుగు.. ప్రాంగణంలో పెట్రోల్ బంకు

విశాలాంధ్ర - పాలకొండ : పాలకొండలో ఉన్న రహదారులు మరియు భవనాలు శాఖకు చెందిన ఆర్అండ్బీ బంగ్లాకు ఘనమైన చరిత్ర ఉంది. పాలకొండ, సీతంపేట రహదారిలో ఏలాం జంక్షన్ సమీపంలో ఉంది. బ్రిటీష్ పాలనలో ఈ బంగ్లా నుంచే కార్యకలాపాలు సాగించినట్లు పలువురు పెద్దలు చెబుతున్నారు. పాలకొండతో పాటు సమీప ప్రాంతాల నుంచి పర్యటనలకు వచ్చి ప్రముఖులకు విశ్రాంతి ఇచ్చేది ఈ ఆర్ అండ్బీ బంగ్లా. ఇంతటి ప్రముఖమైన బంగ్లా. గత కొద్ది కాలంగా నిర్వహణ లేకడపోవడంతో దీని రూపుమారింది. తాజాగా ఇదే ఆవరణలో సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో ఆనాటి ఆర్అండ్బీ బంగ్లా కనుమరుగు అవుతుంది.

- ఎంతో మంది అధికారులకు విశ్రాంతి... ఇదే బంగ్లాలో నాడు పాలకొండ, టెక్కలి, ఆర్డీవో అధికారులు నీలం సహాని, సహాని అధికారులు ఈ బంగ్లాలోనే ఉండేవారు. పాలకొండ ప్రాంతానికి చెందిన పాతతరం రాజకీయాలు నాయకులు మరియు ప్రస్తుత రాజకీయ నేతలకు ఎందరికో విశ్రాంతి భవనంగా ఉండేది. నిర్వహణ లేకపోవడంతో సుమారు ఎనిమిది సంవత్సరాలుగా నిర్వీర్యంగా పడి ఉంది. దీంతో ఈ ప్రాంతంలో చీకటి కార్యకలాపాలకు, మందుబాబులకు వేదికగా మారింది. ప్రధాన రహదారికి ఆనుకొని ఈ ఆర్అండ్ బీ బంగ్లా ఉండడంతో దీనిని చేజిక్కించుకునేందుకు పెద్దల కన్ను పడిందని పట్టణ ప్రజలలో గుస గుసలు కూడా వినిపించాయి. రహదారి బంగ్లాలను నూతనంగా నిర్మించేందుకు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కృషి చేస్తే బాగుంటుందనే వాదన కూడా ఉంది. వివిధ పర్యటనల నిమిత్తం అధికారులు, రాజకీయ నాయకులు ఈ ప్రాంతానికి వచ్చిన సమయంలో పాలకొండలో ప్రస్తుతం ప్రైవేటు లాడ్జీలే దిక్కవుతున్నాయి. కాగా పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో రక్షిత మంచినీరు అందించేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం నాన్అమృత పథకం ద్వారా రూ.58 కోట్లు మంజూరు అయింది. ఇదే స్థలంలో మంచినీటి నిర్వహణ ట్యాంకు నిర్మాణానికి మున్సిపల్ శాఖ అధికారులు సర్వేచేయించారు. నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఏడాది క్రితం వివిధ శాఖల అధికారులకు విన్నవించారు. అయినా నేటికీ అనుమతులు రాలేదు. ఇదే ప్రాంగణంలో ఐటీడీఏ అధికారులు అడిగిందే తడువుగా 24సెంట్లు స్థలాన్ని ఆఘమేఘాలపై మంజూరు అయింది. ప్రస్తుతం పెట్రోల్ బంకు నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. అతి తక్కువ కాలంలో అనుమతులు ఇచ్చిన అధికారులు 50వేల మంది జనాభాకు ఉపయోగపడే మంచినీటి ట్యాంకు కు అనుమతి ఇవ్వకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఇదే అంశంపై ఆర్అండ్బీ జెఈ జగన్మోహన్రాజు వద్ద విశాలాంధ్ర ప్రస్తావించగా.. జిల్లా కలెక్టర్ నిర్ణయం మేరకే ఈ నిర్ణయం జరిగిందని బదులిచ్చారు. ఈ పెట్రోల్ బంకు నిర్మాణాల విషయంపై నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వరరావు వద్ద విశాలాంధ్ర ప్రస్తావించగా.. పట్టణ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. ఐటీడీఏ పీవో నగర పంచాయతీకి లేఖ రాయడం జరిగిందని, రూ.40 వేలు ఫీజు నగర పంచాయతీకి కట్టమని డిమాండ్ పంపినప్పటికీ ఇంత వరకు రూపాయి కూడా ఐటీడీఏ నుంచి కట్టలేదని, ఏవిధమైన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయలేదని తెలిపారు.

జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్

విశాలాంధ్ర - చీపురుపల్లి : రోజు చీపురుపల్లి మేజర్ పంచాయతీ లో ఉపాధి హామీ పథకం పై సోషల్ ఆడిట్ ప్రజా వేదిక మరియు గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొన్న విజయనగరం జిల్లా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి జిల్లా టెలికాం బోర్డ్ సభ్యులు ఇప్పిలి తిరుమల, ఎంపీటీసీలు గెరిడ రామదాసు, పతివాడ రాజారావు, ముల్లు పైడిరాజు,పార్టీ నాయకులు మీసాల సాయి, కర్ణపు ఆదినారాయణ, వార్డు మెంబర్లు, నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం లో మన చీపురుపల్లి మేజర్ పంచాయతీ లో 2022-23వార్షిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులు మరియు ఉపాధి హామీ పథకంలో పథకంలో మంజూరు అయిన సిసి రోడ్లు, సిసి డ్రైనేజీలు,పై సోషల్ ఆడిట్ ప్రజా వేదిక చేపట్టారు అని తెలిపారు. ఉపాధి హామీ పథకం లో ఇంకా ప్రజలకు నూతన జాబ్ కార్డ్ లు కావాలంటే మంజూరు చేస్తాం అని తెలిపారు. ప్రజా వేదికలో చదివిన పలు విన్నపాలనుపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం అని తెలిపారు.

కాలంరాజుపేటలో సామాజిక పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలోని కాలం రాజుపేట గ్రామంలో శుక్రవారం సామాజిక పింఛన్లు ఆ గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నారని అన్నారు ఈ నెలలో కొత్త పింఛన్లు కూడా అందజేశామన్నారు.

పంట నమోదును పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలోని శ్రీరంగరాజపురంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని గజపతినగరం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కే మహా రాజన్ మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి లు శుక్రవారం పరిశీలించారు మండలంలో ఇప్పటివరకు 315 ఎకరాలు పంట నమోదు జరిగింది ఈనెల 15వ తేదీలోగా రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని సూచించారు పంట నమోదు అనంతరం ఈకేవైసీ చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయ కులు వినయ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : మేయర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని మేయర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. 8 డివిజన్లకు సంబంధించి 590 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమమే ధ్యేయంగా, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అద్భుతమైన పథకాలను అందిస్తున్నారన్నారు. నవరత్నాలు అమలులో భాగంగా పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ పేదల పక్షపాతిగా మన్ననలు అందుకుంటున్నారన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా, వాహన మిత్ర,విద్య కానుకలు, విద్యా దీవెన వంటి అనేక పథకాలను అందిస్తూ పేదలను ఆదుకునే రీతిలో పాలన సాగిస్తున్నారన్నారు. ఒకటో తేదీ కల్లా వాలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందించడం దేశంలో మరెక్కడా లేదని అన్నారు. అవ్వా తాతల ముఖాలలో చిరునవ్వులను చూడడమే ఆయన ఆశయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్వివి రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటి రాజు, వైసీపీ నాయకులు ఎవర్ణ కుమారస్వామి, బొంగు భానుమూర్తి, టిపిఆర్ఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలో కొలువుదీరిన శ్రీదుర్గాదేవి అమ్మవారిని మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారు సరస్వతి అలంకారంలో భక్తులను అలరించారు. అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెన్నులు, వసువు కొమ్ములు అలంకరించడంతో పాటు అమ్మవారి ఒడిలో వీణను అమర్చారు. భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రవికుమార్ శర్మ మాట్లాడుతూ మూడవ శుక్రవారం నాడు అమ్మవారికి పసుపు వెన్నెలు అలంకరించి సరస్వతి దేవిగా అలంకారం చేశామని, అమ్మవారిని దర్శించుకున్న వారికి విద్య సౌభాగ్యం వంటివి లభిస్తాయని తెలిపారు. అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు ప్రముఖ వేద పండితులు విన్నకోట భాస్కర శర్మ నిర్వహించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి

విశాలాంధ్ర - సీతానగరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేఖ విధానాలు విడనాడాలని సిపిఎం పార్టీమండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మండలనాయకులు గవర వెంకట రమణలు తెలిపారు.శుక్రవారం బూర్జ, లక్ష్మిపురం, నిడగల్లు, రంగమ్మపేట, ఆర్, వెంకమ్మపేట సచివాలయలముల ముందు నిరసన కార్యక్రమాలను వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకట రమణలు మాట్లాడుతూ ఈ ఎల్ అర్ పేరుతో రాత్రివూట సుమారు 2 నుండి 4 గంటలపైగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, వేళాపాలలేని విద్యుత్ కోతలు నివారించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు, నిత్యవసర సరుకుల ధరల భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులు తమ తీరు మార్చుకోవాలని, లేకుంటే భవిష్యత్లో ప్రజలందరి మద్దతూ కూడ గట్టి సిపిఎం పార్టీ పోరాటం చేస్తామని తెలిపారు. ప్రజల వద్దనుండి సంతకాల సేకరణచేసి, ఆయా గ్రామపరిధిలో గల సచివాలయఅధికారులకు రెండు రోజుల పాటు వినతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 4న మండల తహసీల్దార్ కార్యాలయాలవద్ద నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీసభ్యులు నారాయణరావు, మాత్రావు సింహాచలం, నానిబాబు, రెడ్డి రమణ మూర్తి, రెడ్డి సత్యనారాయణ, యాళ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా ఇటీవల ప్రకటించిన జిల్లా స్థాయి పార్టీ నియా మకాలలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ ఉపాధ్యక్షులుగా పార్వతీపురం మండలం వైసీపీ సీనియర్ నాయకులు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమవరపు కృష్ణమూర్తిని పార్టీ నియమించింది, జిల్లా పార్టీ సెక్రటరీలుగా సీతానగరం మండలానికి చెందిన పోల. ఈశ్వర నారాయణ, ఎక్జిక్యూటివ్ మెంబర్లుగా వేమల దానబాబు, రెడ్డి అప్పలనాయుడు, కోట సంజీవి నియమించబడ్డారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావును మర్యాద పూర్వకంగా కలుసుకుని తమకు మంచి గుర్తింపు ఇచ్చి, పార్టీలో సముచిత స్థానాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, కృతజ్ఞతలు తెలుపుతూ మా అందరి కష్టాన్ని గుర్తించి తమ పేర్లను సిఫార్సు చేసిన ఎమ్మెల్యే జోగారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోమ్మి రమేష్, బొంగు చిట్టి రాజు, పలువురు వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు భోదన పరికరాలు పంపిణీ

విశాలాంధ్ర - భోగాపురం : శరీరంలో అవయవాలు లోపించి నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదిమంది దివ్యాంగ పిల్లలకు జాతీయ మేధో వైకల్య సాధికార సంస్థ వారు బోధనా పరికరాలను శుక్రవారం పంపిణీ చేశారు. దివ్యాంగులు ఈ ఉపకారణాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని దివ్యాంగుల తల్లిదండ్రులకు మండల విద్యాశాఖ అధికారులు ఎం .రమణమూర్తి, బి. చంద్రమౌళిలు సూచించారు. అలాగే దివ్యాంగులకు బోధనా ఉపకరణాల కిట్లు అందేటట్టు సహాయ సహకారాలు అందజేసిన ఐఈఆర్పీ రమణరాజుకు అభినందనలు తెలియజేశారు.